క్లుప్తంగా

ఎమ్మెల్యే వివేకానంద్‌ను గెలిపించుకుంటామని తీర్మానం



ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతూ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న దత్తాత్రేయనగర్ వాసులు

కుత్బుల్లాపూర్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ డివిజన్ దత్తాత్రేయనగర్‌లో గ్లాండ్ ఫార్మా సౌజన్యంతో రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాజీ కార్పొరేటర్ గౌరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మూడోసారి వివేకానంద్‌ను ఎమ్మెల్యేగా గెలుపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు గ్రాండ్ ఫార్మా లిమిటెడ్ ఎండీ శ్రీనివాస్ సాధు, ఎంఈఓ ఆంజనేయులు, అసిస్టెంట్ ఎంఈఓ రమేష్, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా వేణుగోపాల్ యాదవ్ నియమితులయ్యారు. సోమవారం వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ అధ్యక్షతన ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అలాగే డైరెక్టర్లుగా పాపిరెడ్డి, వెంకటేష్, బంద అనిత మహేందర్, ప్రవీన్ కుమార్ గుప్తా, సమ్మయ్య, మహేష్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణారావు, బీఆర్‌ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ రుద్ర అశోక్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను చులకనగా చూడొద్దు

దుండిగల్: రానున్న ఎన్నికల్లో ముదిరాజు కులస్తులు గెలుపోటములను ప్రభావితం చేస్తారని.. తమను చులకనగా చూడొద్దని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు చినంగి వెంకటేశం ముదిరాజ్ అన్నారు. గండిమైసమ్మ చౌరస్తాలో సోమవారం ముదిరాజ్ సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. వెంకటేశం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షలకు పైగా ముదిరాజ్ కులస్తులు ఉన్నారన్నారు. ముదిరాజులకు జరుగుతున్న అవమానాలు, అన్యాయాలతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ ఒక్కరికి కూడా ఎమ్మెల్యే టికెట్ కేటాయించకపోవడం విచారకరమన్నారు. దీనికి నిరసనగా మంగళవారం గండిమైసమ్మ చౌరస్తాలో నిర్వహించనున్న మహాధర్న కార్యక్రమానికి పెద్ద ఎత్తున్న హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

నిజాంపేట్: అభివృద్ధి పనుల విషయంలో ఆలక్ష్యం వహించకుండా వెంటనే పూర్తి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సోమవారం మేయర్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజాంపేట్ కమాన్ నుంచి బాచుపల్లి వరకు చేపట్టే రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరుగకుండా ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. అదే విధంగా వివిధ డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి, పనులు త్వరలో చేపట్టబోయే పనులపై ఆయా విభాగాల అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ నేత జెమ్మి దేవేందర్ సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపల్ పరిధిలో పదో తరగతి పూర్తి చేసిన పేద విద్యార్థులు స్థానికంగా జూనియర్ కళాశాల లేక దూర ప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారని అన్నారు. స్థానికంగా ఉన్న జనాబాను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని వినతిలో కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం

దుండిగల్: ప్రాధాన్యతా క్రమంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్లు విన్నవించారు. దీనిపై స్పందించిన కృష్ణవేణి యుద్ధప్రాతిపదికన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుచరిత, వైస్ చైర్మన్ పద్మారావు, కమిషనర్ సత్యనారాయణ, టీపీఓ సాయిబాబా, రెవెన్యూ అధికారి సునంద, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి.. అసౌకర్యం

- నిధులు మంజూరు చేయని అధికారులు
- చేతులు ఎత్తేసిన సదరు కాంట్రాక్టర్
- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు
- స్నానాలకు వాటర్ ట్యాంకర్ల తెప్పించుకోవాల్సిన దుస్థితి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

▶ నిలిచిన వైకుంఠధామం పనులు



చింతల్ శ్మశానవాటికలో మధ్యలో నిలిచిపోయిన వైకుంఠధామం నిర్మాణం

చింతల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి శ్రీకారం చుడుతుంటే.. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. పనులను నాసిరకంగా చేపడటంతో పాటు పనులు పూర్తి చేయడంలో జాప్యం చేస్తున్నారు. చింతల్ డివిజన్‌లోని చింతల్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న శ్మశానవాటికలో వైకుంఠధామం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీని కోసం గతేడాది కోటి ఆరు లక్షల రూపాయలతో పనులకు శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా వైకుంఠధామాన్ని కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకంగా పనులు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు సగం పనులే పూర్తయ్యాయని చెబుతున్నారు. మిగిలిన పనులకు అధికారులు నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు.



నత్తనడకన సాగుతున్న స్నానపు గదుల నిర్మాణం

◆ **స్నానపు గదులు లేక ఆరుబయటే..**

వైకుంఠధామంలో అసంపూర్తి పనులతో దహన సంస్కారాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్నానాల గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేయడానికి వాటర్ ట్యాంకర్లను తెప్పించుకోవాల్సి వస్తోందని అక్కడికి వచ్చే వారు చెబుతున్నారు. మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు.

◆ **ఏడాదైనా పూర్తికాని పనులు**

2022 ఆగస్టులో వైకుంఠధామం పనులకు శంకుస్థాపన చేస్తే ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు. రూ.1.06 కోట్లతో చేపట్టిన ఈ పనులకు రూ.45 లక్షలే విడుదల చేయడం గమనార్హం. మిగతా నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠధామం పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.



దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేసిన నీటి కుళాయిలు గదుల దృశ్యం

అవును.. వాళ్లిద్దరు కలవలేదు!

ఎందుకో.. ఏమైందో మళ్లీ కలవని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



ఎమ్మెల్సీ



ఎమ్మెల్యే

- సోమవారం ఎమ్మెల్సీ ఇంటికి వెళ్లినా అందుబాటులోకి రాని శంభీపూర్‌రాజు
- గంటసేపు ఎదురు చూసి వెనుదిరిగిన ఎమ్మెల్యే వివేకానంద్
- వీరి మధ్య అసలు ఏమి జరిగిందంటూ పార్టీలో గుసగుసలు

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుల మధ్య దోబూచులాట కొనసా...గుతూనే ఉంది. సోమవారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్సీ రాజు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే వివేకానంద్‌కు మరోసారి చుక్కెదురైంది. అక్కడికి వెళ్లిన తర్వాత మంత్రి హరీష్‌రావు నివాసానికి ఎమ్మెల్సీ వెళ్లినట్లు తెలుసుకున్నారు. సుమారు గంటసేపు అక్కడే ఉండి ఎమ్మెల్యే టిఫిన్ చేసి, టీ తాగి వెళ్లడం విశేషం.

సీఎం కేసీఆర్ నిర్ణయంతో కంగుతిన్న ఎమ్మెల్సీ..

◆ ఈనెల 21వ తేదీన సీఎం కేసీఆర్ పార్టీ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో కుత్బుల్లాపూర్ అభ్యర్థిగా ఎమ్మెల్యే వివేకానంద్‌కు మరోసారి అవకాశం కల్పిస్తూ ప్రకటన చేశారు. ఇక్కడి నుంచి పోటీ చేసే ఆలోచనలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఉండే. కానీ ఒక్కసారిగా అధినేత తీసుకున్న నిర్ణయంతో ఎమ్మెల్సీ కంగుతున్నాడు. నాటి నుంచి నేటి వరకు వీరిద్దరూ కలుసుకున్న దాఖలాలు లేవు.

ప్రకటన తర్వాత ఎమ్మెల్యేను కలవని ఎమ్మెల్సీ వర్గం..

◆ అంతేకాకుండా ఎమ్మెల్సీ వర్గీయులుగా ఉన్న ఏ ఒక్క ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే వివేకానందును కలిసే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఓ వర్గం ఏకంగా విదేశాలకు టూర్ పేరిట వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న వివేకానంద్ ఎమ్మెల్సీ ఇంటికి మూడు పర్యాయాలు వెళ్లి వచ్చారు. ఎమ్మెల్సీ ఆదివారం ఎమ్మెల్యే ఇంటికి వచ్చి వెళ్లడంతో ఇద్దరి మధ్య దోబూచులాట కొనసాగుతూ వస్తోంది.

ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రచారం..

◆ ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ రాజుల మధ్య రెండు సంవత్సరాలుగా నువ్వా..! నేనా.!! అన్నట్లుగా ఎవరికి వారే కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. అంతేకాకుండా ఎక్కడ కలిసిన కార్యక్రమాలు చేసిన దాఖలాలు లేవు. దీంతో నాటి నుంచి నేటి వరకు అదే గ్యాప్ కొనసాగుతూ వస్తోంది. ఎమ్మెల్సీ వర్గీయులుగా ఉన్న కొంత మంది కార్పొరేటర్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా వివేకానందును ప్రకటించినప్పటికీ చివరి నిమిషంలో ఎమ్మెల్సీ రాజుకు డిక్లేర్ చేస్తారని ప్రచారం చేస్తూ వస్తున్నారు.

◆ అధినేత తీసుకున్న నిర్ణయం ప్రకారం వివేకానంద్ అభ్యర్థిగా కొనసాగుతారని అందులో ఎలాంటి డౌట్ లేదని ఎమ్మెల్యే వర్గీయులు చెప్పుకొస్తున్నారు. ఇలా ఎవరికి వారే ప్రచారం చేస్తూ రావడంతో ఇక్కడ పార్టీ పరిస్థితి ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వీరిద్దరి గొడవ వల్ల అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ నాయకులు దూకుడు పెంచారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు చేపడతాం



ఐడీపీఎల్ చౌరస్తాలో విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

రంగారెడ్డినగర్: విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు చేపడతామని వామపక్ష నేతలు పేర్కొన్నారు. సోమవారం ఐడీపీఎల్ చౌరస్తాలో విద్యుత్ అమర వీరుల సంస్మరణార్థం వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శులు కాలుకాని లక్ష్మణ్, ఉమామహేష్‌లు మాట్లాడుతూ.. 2000 సంవత్సరం ఆగస్టు 28న పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన వామపక్ష కార్యకర్తలపై బషీరాబాగ్ చౌరస్తాలో అప్పటి టీడీపీ ప్రభుత్వం జరిపించిన పోలీస్ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారన్నారు. చాలా మంది కార్యకర్తలు ఆనాడు జరిగిన పోలీస్ బుల్లెట్ గాయాలను ఇప్పటికి తలచుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు.

◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణల పేరుతో కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నాయని, ఏ ప్రభుత్వమైన విద్యుత్ చార్జీల మోతకు ప్రయత్నిస్తే వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని, సంక్షేమ పథకాలతో కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలే లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం చింతల్ డివిజన్ కార్యదర్శి, సత్యం, మండల కమిటీ సభ్యులు అంజయ్య, బీరప్ప, జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, సీపీఐ నాయకుడు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మహ్మద్ అక్బర్‌కు నియామక పత్రం అందజేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీ దుండిగల్ మున్సిపాలిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్ అక్బర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అక్బర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, నేతలు మహేశ్, మద్దికుంట నవీన్‌రెడ్డి, సమీర్‌ఖాన్, మిద్దెల యాదిరెడ్డి, చింతకింది సురేశ్, రాధాకృష్ణ, పరశురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు..

కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఉమ్మడి మండల మాజీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బౌరంపేటలోని పార్టీ కార్యాలయంలో భూపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సూరారం సంజయ్ గాంధీనగర్‌కు చెందిన ఎండీ సిరాజ్ డివిజన్ మైనార్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. సోమవారం హన్మంతరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. . కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, మొండి సాయికృష్ణ, ఎండీ లాయక్, షఫీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్యంతోనే పేదల కష్టాలు తీరుతాయి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్



జీడిమెట్ల: కార్మిక రాజ్యంతోనే పేద ప్రజల కష్టాలు తీరుతాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని పాట్లూరి నాగేశ్వరరావు భవన్‌లో మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూసుఫ్ ముఖ్యఅతిథిగా హాజరై సభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు నడుస్తూ అన్ని ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ పరం చేస్తూ ప్రజలపైన ఆర్థిక బారం మోపుతున్నాయని అన్నారు. ఇలా ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తూ ఉంటే మరోవైపు పెట్టుబడిదారులు కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వకుండా దోపిడీ చేస్తున్నారని అన్నారు. నేటి ప్రభుత్వం పెట్టుబడిదారులకు సహకరిస్తూ ప్రజలను మోసం చేస్తోందని కేంద్ర ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. శిక్షణా తరగతుల్లో ఉమామహేశ్, రవిచందర్, స్వామి, వెంకటరెడ్డి, మహేందర్, రాములు, షేకర్, కార్మికనాయకులు పాల్గొన్నారు.

◆ **ప్రజల ఆలోచనలను పక్కదోవపట్టిస్తున్న రాజకీయ పార్టీలు..**

ప్రజలు ప్రభుత్వం చేస్తున్న మోసాలను తెలుసుకోకుండా రాజకీయ పార్టీలు కులం, మతం రంగును ప్రజలపై రుద్ది ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేలా చేస్తున్నాయని అన్నారు. ప్రజలకు ఈ నిజం తెలిసేలా వారిని చైతన్యపరచాలని ఆయన ఏఐటీయూసీ కార్యకర్తలకు సూచించారు. కార్మికులు సైతం వారి హక్కులపై అవగాహన పొంది వారికి న్యాయపరంగా రావాల్సిన మొత్తాన్ని పరిశ్రమల నుంచి తీసుకోవాలని అన్నారు. సమాజ పరిణామంపైన కార్యకర్తలకు బాలరాజు అవగాహన కల్పించారు.

ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తాం

జగద్గిరిగుట్ట: ఆమ్ ఆద్మీ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమావేశం సోమవారం ఈ కార్యక్రమం ఆప్ కోర్ కమిటీ కమిటీ సభ్యుడు బుర్ర రాముగౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కన్వీనర్ ఎండీ వాజిద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జులు, కోఆర్డినేటర్లను నియమించారు. జగద్గిరిగుట్ట డివిజన్ ఇన్‌చార్జ్‌గా సతీష్‌కుమార్, మైనారిటీ ఇన్‌చార్జ్‌గా నజీరుద్దీన్, మహిళా విభాగం కోఆర్డినేటర్ ప్రతినిధిగా నస్రీన్ పర్వీన్, సీవైఎస్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా శ్రావణ్‌కుమార్, సీవైఎస్ఎస్ విద్యార్థి విభాగం వైస్ అధ్యక్షుడిగా మహమ్మద్ ఖాజా ఇర్ఫాన్ ఆలీ, నిజాంపేట్ డివిజన్ 4 ఇన్‌చార్జ్‌గా రామ్‌కుమార్, మైనారిటీ వింగ్ కోఆర్డినేటర్‌గా మహమ్మద్ ఖలీం హుసేన్‌ను నియమించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

కార్మికుల సంక్షేమానికి బీఎంఎస్ పెద్దపీట

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి బీఎంఎస్ పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కొంపల్లిలోని హిల్టన్ టొబాగో కంపెనీ యూనియన్ అధ్యక్ష ఎన్నికల్లో ఇటీవల బీఎంఎస్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో సోమవారం కార్మికుల సమస్యలు, ఇతర డిమాండ్ల విషయమై మేనేజ్‌మెంట్‌తో యూనియన్ అడ్వైజర్ మల్లారెడ్డి, ప్రెసిడెంట్ మల్లేశం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల అలవెన్స్‌లు, సదపాయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, యూనియన్ ఆఫీష్ బేరర్స్ సంపత్, చారి ఉన్నారు.

ఈవీఎం అవగాహన ప్రచార వాహనం ప్రారంభం



ఈవీఎం అవగాహన ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు

కుత్బుల్లాపూర్: ఓటర్లలో అవగాహన నింపేందుకు నియోజకవర్గంలో విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యలయంలో సోమవారం ఈవీఎం అవగాహన ప్రచార వాహనాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశం ఓటు హక్కు వినియోగించుకునే వారి అనుమానాలను నివృత్తి చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించామన్నారు. ప్రతి ఏరియాలో స్థానికులతో ఓట్లు వేయించడం, అవి ఎలా పడ్డాయి అన్న వివరాలను ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా ఓటర్ల నమోదు వంటి విషయాలను క్లుప్తంగా తెలుసుకునేలా ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సైదులు కోరారు. ఈ కార్యక్రమంలో జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు మల్లయ్య, నాగమణి, కుత్బుల్లాపూర్ మండల తహసిల్దార్ రహమాన్ ఖాన్, కుత్బుల్లాపూర్ ఎంపీసీ ఉదయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



ఓనం.. వైభవం



సుభాష్‌నగర్: పండగల విశిష్టత, పురాణ కథల ప్రాముఖ్యతల గురించి నేటి యువత తెలుసుకోవాలని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. బలి చక్రవర్తి త్యాగ గుణానికి, సువర్ణ పరిపాలన విధానానికి ప్రతీకగా జరిపే ఓనం పండుగను సోమవారం సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్లో ఘనంగా జరుపుకున్నారు. ఓనం పండుగ పురాణ కథను ప్రాముఖ్యతను విద్యార్థులు నాట్యక రూపకంగా కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. మలయాళీ సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

ఇళ్లు ఇచ్చే వరకు మా పోరాటం ఆగదు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్
- ఉద్రిక్తతకు దారి తీసిన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి
- శ్రీశైలంగౌడ్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు
- పోలీసుల రక్షణ వలయంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్



శ్రీశైలంగౌడ్‌ను తరలించకుండా అడ్డుకుంటున్న కార్యకర్తలు



తోపులాటలో చినిగిన శ్రీశైలంగౌడ్ దుస్తులు

కుత్బుల్లాపూర్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలనే డిమాండ్‌తో బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి సోమవారం ఉద్రిక్తతకు దారి తీసింది. ఉదయం నుంచే బీజేపీ నేతలను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ నివాసం వద్ద పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు.. ఆయనతో పాటు పలువురు కార్యకర్తలను గృహ నిర్బంధం చేసి ఆయన నివాసానికి తాళం వేశారు. దీంతో ఆగ్రహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులకు, బీజేపీ నేతలకు మధ్య తోపులాట జరుగగా శ్రీశైలంగౌడ్‌తో పాటు పలువురు బీజేపీ నేతలకు గాయాలయ్యాయి. చివరకు పోలీసులు ఆయను అరెస్ట్ చేసి జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో బీజేపీ శ్రేణులు షాపూర్‌నగర్ రోడ్డు పైనే బైఠాయించి పోలీసులకు.. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వారిని సైతం అరెస్ట్ చేసి జగద్గిరిగుట్ట ఠాణాకు తరలించారు.

పోలీసులు కార్యకర్తలను కొట్టడంపై ఆగ్రహం..

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ...తొమ్మిదేళ్లుగా పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్న దద్దమ్మ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అని విమర్శించారు. అరకొరగా కట్టిన ఇళ్లు శిథిలావస్థకు చేరాయని.. పేదలకు పంపిణీ చేయకుంటే ఊరుకునేది లేదన్నారు. తాను పాదయాత్ర చేస్తున్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వడం లేదని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పేదలకు ఇళ్లు, పట్టాలు, రేషన్ కార్డులు ఇప్పించానన్నారు. పేదలకోసం తాను పోరాడుతుంటే పోలీసుల చేత అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను గృహ నిర్బంధం చేసి ఇంటికి తాళం వేశారన్నారు. ఈ కార్యకర్తలను కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చేంత వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

◆ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చండీ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్ యాదవ్, పత్తి రఘుపతి, జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్ ముదిరాజ్, బావిగడ్డ రవి, జిల్లా కార్యదర్శి జగన్ మోహన్ రావ్, డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, పున్నా రెడ్డి, పరుష వేణు, దుర్యోధన రావు, కంది శ్రీరాములు, రాజేశ్వర్ రావ్, డివిజన్ ఇన్‌చార్జులు మోతే శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా నాయకులు అర్కల సుధా, అలివేలు, అరుణా రెడ్డి, రోజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద భారీ బందోబస్తు..

పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద పోలీసులు రక్షణా వలయంగా ఉండి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అటు వైపు ఎవరినీ వెళ్లకుండా కట్టడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం దాగా ఎవరినీ అనుమతించలేదు. కొంపల్లి ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.